క్లుప్తంగా

అకాల వర్షానికి పంట నష్టం



దేగానిపల్లిలో నేలవాలిన మొక్కజొన్న పంట

బి.కొత్తకోట : అకాల వర్షాలకు మండలంలోని బి.కొత్తకోట, సూరప్పగారిపల్లె గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసిన విషయం తెలిసిందే. భారీగా ఈదురు గాలులు వీచడంతో మొక్కజొన్న పంట పొలాల్లోనే నేలవాలింది. టమాట, ఇతర పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టాలపై వివరాలు సేకరిస్తున్నామని ఏఓ చంద్రశేఖర్ తెలిపారు.

ఆలయంలోకి మురికి నీరు



ఆలయంలోకి చేరిన బురద నీరు

బి.కొత్తకోట : బి.కొత్తకోటలో బుధవారం సాయంత్రం కురిసిన వర్షాలకు రోడ్లపై నీరు చేరింది. పట్టణంలోని దిగువబస్టాండ్ వద్దగల చెన్నకేశవస్వామి ఆలయంలోకి మురికి నీరు ప్రవహించింది. రోడ్డుపై నుంచి బురదతో కూడిన నీరు ఆలయంలోకి చేరింది. ఉదయాన్నే అర్చకులు శుద్ధి చేసేందుకు ఇబ్బందిపడ్డారు. కాగా వర్షపు నీరు ఆలయంలోకి చేరకుండా దేవదాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు యోగ సర్టిఫికెట్స్ ప్రదానం



సర్టిఫికెట్లతో చిన్నారులు, షీ సంస్థ నిర్వాహకులు

పీలేరు : యోగ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని షీ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పీవీఎస్.లక్ష్మీ అన్నారు. స్థానిక వీఎస్ఎన్ సిద్ధార్థ పాఠశాలలో 27మంది విద్యార్థులకు యోగశ్రీ అవార్డులు గురువారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షీ దివ్య యోగ విద్యాలయంలో ఈ నెల 25వ తేదీ నుంచి వేసవి యోగ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మాధవి, రాయల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం వితరణ



పచ్చిమేతను తీసుకెళుతున్న ట్రస్టు సభ్యులు

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని మల్లికార్జున రెడ్డి తండ్రి తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం మల్లయ్యకొండ గోవులకు పచ్చి మేత గురువారం వితరణగా ఇచ్చారు. మల్లికార్జునస్వామి అన్నదాన ట్రస్టు సభ్యులు పశుగ్రాసాన్ని శ్రమదానంతో కోసి ట్రాక్టర్‌లో నింపుకొని మల్లయ్యకొండకు చేర్చారు. వేసవిలో గోవులకు దాతలు పశుగ్రాసం వితరణ ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

ఇంటింటికీ ఉపాధ్యాయులు



విద్యార్థులను అప్పగిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

బి.కొత్తకోట : ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ప్రభుత్వ హైస్కూల్‌లో చేర్పించాలని కోరుతూ గురువారం ఎంఈవో రెడ్డి శేఖర్, ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటింటి పర్యటన చేశారు. స్థానిక బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 8 మంది విద్యార్థులను జడ్పీ బాలుర హైస్కూల్‌లో చేర్పించాలంటూ తల్లిదండ్రులను కోరారు. వారి అంగీకారంతో విద్యార్థులను జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులకు అప్పగించారు. ఎంఈవో మాట్లాడుతూ హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్య 200కు దాటేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు భాస్కర్, ఖాజాపీర్, ఉపాధ్యాయులు ఈ.మునిరెడ్డి, మురళీ, బి.ఖాదర్‌బాషా, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత ఖత్నకు స్పందన



సరకులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పెద్దమండ్యం : మండలంలోని ఎస్‌వోపల్లె పంచాయతీ కలిచెర్ల పాతూరులోని మదరసా అరబి రషీదియాలో గురువారం నిర్వహించిన ఉచిత ఖత్నకు విశేష స్పందన లభించింది. మదరసా-ఎ- అరబియా రషీదియా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 50 మంది చిన్నారులకు డాక్టర్ సికిందర్ చికిత్స చేశారు. ఉచితంగా మందులు, సరకులు అందజేశారు. గౌస్‌పీరా, నజీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

కొండలకు నిప్పు.. పంటలకు ముప్పు

అసలే వేసవి కాలం.. ఎండ వేడిమికి అడవులకు మంటలు వ్యాపించడం పరిపాటి. కానీ కొందరు ఆకతాయిలు కొండలు, గుట్టల్లో గడ్డి, చెట్లకు నిప్పు పెడుతుండడం రైతులకు శాపంగా మారుతోంది. వాటి దిగువన రైతుల పంట పొలాలు, మామిడి తోటలు ఉండడంతో నిప్పు రేగినపుడు పంట కాపాడుకొనేందుకు నానా పాట్లు పడుతున్నారు. చేసేదిలేక వేల రూపాయలు ఖర్చు చేసి జేసీబీతో కొండలు, గుట్టల దిగువ భాగన ఉన్న పొలాలకు కందకాలు తవ్వుకొంటున్నారు.



చిట్టిబోయనపల్లె పరిసరాల్లో జేసీబీలతో కందకాల తవ్వకం



మామిడి తోటల వద్ద వ్యాపించిన మంటలు

- మంటలు అదుపు చేసేందుకు రైతుల పాట్లు!
- జేసీబీలతో దిగువన కందకాల తవ్వకాలు

గుర్రంకొండ : గుర్రంకొండ పరిసరాల్లోని కొండలు, గుట్టలు విస్తారంగా ఉన్నాయి. వీటి దిగువన వందల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. కొందరు మామిడి, ఇతర ఉద్యాన పంటలు వేశారు. అయితే గత కొన్నిరోజులుగా గుర్తుతెలియని దుండగులు ఈ పొలాలకు పై భాగంలో కొండలు, గుట్టలకు నిప్పు పెడుతున్నారు. దీంతో వాటితోపాటు దిగువన, పరిసరాల్లోని పంట పొలాలు, మామిడి తోటలు అగ్నికి ఆహుతవుతున్నాయి. మామిడి చెట్లతో పాటు డ్రిప్ పరికరాలు, పైపులు కాలిపోయి రైతులు భారీగా నష్టాల పాలవుతున్నారు.

పది రోజుల్లో 160 ఎకరాలు దగ్ధం

గత పది రోజుల్లోనే 600 ఎకరాల్లోని కొండలు, గుట్టలకు నిప్పంటించిన నేపథ్యంలో కాలి బూడిదయ్యాయి. అంతేగా దిగువన ఉన్న 160 ఎకరాల్లో మామిడితోటలు, డ్రిప్ పరికరాలు, పైపులు కాలిపోయాయి. ఏపుగా పెరిగిన పంట కాలిపోవడంతో రైతులు కన్నీటి పర్యంత మవుతున్నారు. కొందరు రైతులు పరిష్కార మార్గంగా ముందుగానే గుట్టలకు దిగువ భాగాన పొలాల వద్ద రక్షణ చర్యలు చేపట్టారు. వేల రూపాయలు ఖర్చు చేసి జేసీబీతో మామిడి తోటల హద్దులో సుమారు ఆరు అడుగుల మేర కందకాలు తవ్వేస్తున్నారు. దీంతోపాటు చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు తొలగించేస్తున్నారు. మంటలు గుట్టలను కాల్చివేసినా పొలాల వైపు రాకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారు. వీటికయ్యే ఖర్చులతో రైతుల జేబులు ఖాళీ అవుతున్నాయి. వేలాది రుపాయలు జేసీబీల అద్దెల చెల్లించలేక వారు ఆందోళన చెందుతున్నారు. ఉపాధి హామీ పథకంలోనైనా ఈ కందకాలు తవ్వే పనులు చేపడితే తమకు మేలు జరుగుతుందని వారు కోరుతున్నారు.

30 లోపు ఈకేవైసీ పూర్తిచేయాలి



ఈకేవైసీ వివరాలు తెలుపుతున్న ఫిరోజ్‌ఖాన్

మదనపల్లె : రేషన్ బియ్యం పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం చేపట్టిన ఈకేవైసీ ప్రక్రియను ఏప్రిల్ 30వ తేదీలోగా పూర్తిచేయాలని డీటీ ఫిరోజ్ ఖాన్ కోరారు. మండల తహసీల్దారు వీఆర్వోలు, రేషన్‌షాపు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ...రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. అనర్హుల్ని రేషన్ జాబితా నుంచి తొలగించేందుకు ఈ ప్రక్రియను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. సమీపంలోని రేషన్‌షాపు లేదా ఎండీయూ వాహనం వద్దకు వెళ్లి ఈ పోస్ పరికరంలో వేలిముద్ర వేస్తే సరిపోతుందన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు, 80 ఏళ్ల దాటిన వృద్ధులకు ఈకేవైసీ అవసరం లేదన్నారు. ఏప్రిల్ 30లోపు ఈకేవైసీ పూర్తిచేయకపోతే, మే నెల రేషన్ అందదనే విషయం లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోడౌన్ డీటీ సుబ్రహ్మణ్యం, డీలర్స్ ప్రెసిడెంట్ ఇమామ్, ఖాసీమ్, కే.కళాధర్, వి.సుధీర్ బాబు, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల కమిటీ ఏర్పాటు

పీలేరు రూరల్: పీలేరు గ్రామ పంచాయతీ కార్మికుల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులు, వాటర్‌మెన్‌లు, ఎలక్ట్రీషియన్లు సమావేశమై ఈ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బివి.రమణ, కార్యదర్శిగా ఆర్.ఓబులేసు, కోశాధికారిగా బి.నాగార్జున, గౌరవ సలహాదారుగా ఎస్.మస్తాన్‌సాహెబ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ నాయకులు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

చిటుకు వ్యాధిపై అప్రమత్తం



టీకా వేస్తున్న డీడీ సత్యనారాయణ

రామసముద్రం: గొర్రెలు, మేకలకు వచ్చే చిటుకు వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్య శాఖ డీడీ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కెసి.పల్లిలో గొర్రెలు, మేకల్లో చిటుక వ్యాధి నివారణకు ఈటీ టీకా గురువారం వేశారు. డీడీ మాట్లాడుతూ మండలానికి 35 వేల ఈటీ టీకాలు వచ్చాయని, తమ పశువులకు తప్పకుండా కాపరులు టీకాలు వేయించుకోవాలని తెలిపారు. దత్తాత్రేయ, రెడ్డెప్ప పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు విత్తన బంతులు



విత్తన బంతులు తయారు చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ : పర్యావరణ పరిరక్షణ కోసం విత్తన బంతులు తయారు చేస్తున్నట్లు ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.కృష్ణవేణి పేర్కొన్నారు. కళాశాల వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం విత్తన బంతుల తయారీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ వర్షాకాలంలో అటవీ ప్రాంతం, చెట్లు లేని ప్రదేశాల్లో విత్తన బంతులు వేసి అడవుల పెంపకానికి తోడ్పడుతున్నట్లు తెలిపారు. వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు లక్ష్మీదేవి, ఎకో క్లబ్ కన్వీనర్ కుసుమప్రియ మాట్లాడుతూ వన్యజాతి విత్తనాలను మాత్రమే సేకరించి విత్తన బంతులు చేశామని, అన్ని వాతావరణ పరిస్థితులు తట్టుకుని మొలకెత్తి మనుగడ సాధించగలవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కన్వీనర్ జ్యోతి, మోహన్‌వల్లి, విష్ణుప్రియ, సూర్యశేఖర్‌రెడ్డి, గురుమూర్తి, హజీరాఖానం, వనజ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలేటి గంగమ్మ జాతర



తెట్టు పాలేటి గంగమ్మ ఆలయం



అమ్మ వారికి మహిళలు డీలు, బోనాల సమర్పణ

కురబలకోట : మండలంలోని తెట్టు పాలేటి గంగమ్మ జాతర శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పూజారి అంజి తెలిపారు. పాలేటి గంగమ్మ తెట్టు, అంగళ్లు, చింతమాకులపల్లె, నందిరెడ్డిగారిపల్లె, ఎర్రబల్లె తదితర గ్రామ పంచాయతీల ప్రజలకు ఆరాధ్య దేవతగా గంగమ్మ అనాదిగా పూజలందుకుంటోందని తెలిపారు. వివిధ గ్రామాల నుంచి చాందినీ బండ్లతో వారు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకుంటారని వివరించారు. ఇందులో భాగంగా మహిళలు భక్తి శ్రద్ధలతో గురువారం డీలు, బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త పూజారి అంజి తెలిపారు. జాతర నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాతరకు బందోబస్తు ఏర్పాటుచేసినట్లు రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. రికార్డింగ్ డ్యాన్స్‌లను పూర్తిగా నిషేధించామన్నారు.

కార్మిక సమస్యలు పట్టని కూటమి ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివ

మదనపల్లె: రాష్ట్రంలో కార్మిక సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల అధ్యక్షతన నియోజకవర్గ, పట్టణ స్థాయి నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కోటి రూపాయలు జమ చేస్తానని, మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరిస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదన్నారు. మదనపల్లిని జిల్లాగా తక్షణమే ప్రకటించాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ మే 20న చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సురేష్‌కుమార్, ముబారక్, రెడ్డప్ప, తిరుమల, దేవా, వాసు, నాగరాజు, పృథ్వీరాజ్, శేఖర్, వీరాంజనేయులు, కరీముల్లా పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో నాయకులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నిసార్‌అహ్మద్, తదితరులు

మదనపల్లె : రామసముద్రం మండలం మినికి సర్పంచ్ సుబ్బారెడ్డి కుమార్తె వివాహ వేడుకలో గురువారం రాత్రి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ పాల్గొన్నారు. పుంగనూరు వాసవీ కల్యాణమండపంలో జరిగిన వివాహ వేడుకలో నూతన వధూవరులు నేహారెడ్డి, అరవింద్‌రెడ్డిలను వారు ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప, పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి, నాయకులు కొండవీటి నాగభూషణం, భాస్కర్‌గౌడ్, రమణారెడ్డి, గెవెన్న, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


ఫుడ్ పాయిజన్ తో ఐదుగురు పిల్లలకు అస్వస్థత



రామసముద్రంలో ఫుడ్ పాయిజన్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

రామసముద్రం : అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల కేంద్రంలోని చెంబకూరు రోడ్డులో ఉన్న ఓ బేకరీలో కేక్ తిన్న ఐదుగురు పిల్లలు అస్వస్థతకు గురైన సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. రామసముద్రం గాజుల నగర్ కు చెందిన గంగరత్నమ్మ పిల్లల కోసం బేకరీలో కేక్, మిక్చర్ తీసుకెళ్లింది. వారి కుటుంబానికి చెందిన ఐదుగురు పిల్లలు కేక్ తిని వాంతులు రావడంతో హుటాహుటిన రామసముద్రం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు

రాయచోటి టౌన్ : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం రాయచోటి అగ్నిమాపక శాఖ అధికారులు నిర్వహించిన మాక్ డ్రిల్ చూపరులను ఆకట్టుకుంది. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చిన తరువాత అధికారులు వచ్చి ఎలాంటి చర్యలు తీసుకొంటారనే అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్ శ్రీ చైతన్య స్కూల్ భవన ఆవరణలో నిర్వహించారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ఇరుక్కుపోయిన వారిని ఎలా కాపాడాలనే అంశంపై డ్రిల్ చేసి చూపెట్టారు. అత్యవసర సమయంలో ఆ భవనాలలో ఫైర్ సిస్టమ్‌ను ఎలా ఉపయోగించాలనే విషయాన్ని వివరించి చెప్పారు. ఈ డ్రిల్ కార్యక్రమం రాయచోటి ఫైర్‌స్టేషన్ అధికారి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో స్ట్రక్చరల్ టీం రెస్క్యూ టీం, ఫైర్ టీం, ఏ వాక్యూషన్ టీం, చర్చి టీం ఇలా అన్ని విభాగాల అధికారులతో కలిసి నిర్వహించారు.

విగ్రహాల పరిరక్షణకు చర్యలు తీసుకోండి

రాయచోటి అర్బన్ : పట్టణంలోని జాతీయ రహదారి, బస్టాండు మార్గాలలో ఉన్న పలువురు జాతీయ నేతలు, ప్రముఖుల విగ్రహాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పలుసంఘాల నేతలు మున్సిపల్ కమిషనర్ వాసుబాబుకు విన్నవించారు. ఈ మేరకు గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విపరీతమైన వాహనాల రాకపోకల కారణంగా విగ్రహాలపై దుమ్ము,ధూళి పేరుకుపోవడం జరుగుతోందన్నారు. నెలకోమారు విగ్రహాలను నీటితో శుభ్రపరచాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ, వెంకటరమణ, శరత్ కుమార్, యోగానందబాబు, జయరాం, వలీబాషాతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో చదివితే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న మోటివేటర్ రామమూర్తి

మదనపల్లె సిటీ : ఆత్మవిశ్వాసంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని జిల్లా ప్రభుత్వ వైద్యశాల మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ రాధిక పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో డివిజన్‌లోని కేజీబీవీ విద్యార్థినులు, తల్లిదండ్రులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పరీక్షలు, మార్కులే జీవితమా? అంశంపై గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. డాక్టర్ రాధిక మాట్లాడుతూ ఇటీవల కాలంలో పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని, ఉత్తీర్ణత సాధించలేదనే కారణాలతో కొంత విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదో తరగతి పరీక్షా ఫలితాలే విద్యార్థుల అంతిమ లక్ష్యం కారాదని, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళితే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని ప్రముఖ మోటివేటర్ స్పీకర్ రామమూర్తి అన్నారు. ప్రభుత్వం బాలికాభివృద్ధికి పాఠశాలల, కాలేజీ అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఫలితాలు ఎలా ఉన్నా విద్యార్థులు అధైర్య పడవద్దన్నారు. చరిత్ర చూస్తే ఉన్నత స్థానాలను అధిరోహించిన వారు జీవితంలో అనేక ఆటు పోట్లు చవిచూసి ఆ స్థాయికి చేరుకున్నారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని తమ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ మధుమతి, సోషియల్ వర్కర్ గౌతమి, సమగ్రశిక్ష పూర్వ సెక్టోరియల్ ఆఫీసర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్, ఫోర్డు సుభాషిణి, డివిజన్‌లోని కేజీబీవీ ప్రిన్సిపల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పీలేరు : అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి మస్తాన్ పేర్కొన్నారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా విపత్తులు జరిగినపుడు వాటిని ఎదుర్కోవాల్సిన అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు 101కు, లేదా 08584-244399 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నాగిరెడ్డి, హేమాద్రిరెడ్డి, చలపతి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, వెంకటేష్, రెడ్డిశేఖర్, మహబూబ్‌బాషా, చైతన్యకుమార్, జాకీర్, షఫీ, షకీల్‌బాషా పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



ఆర్టీసీ గ్యారేజ్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

పీలేరురూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎంయూ జిల్లా కార్యదర్శి పిఎస్ ఎం.రాజు అన్నారు. స్థానిక గ్యారేజ్ వద్ద రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 సర్క్యులర్‌ను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. నైట్ అవుట్ అలవెన్స్‌లు రూ.400కు పెంచాలని, హైయర్ పెన్షన్ సమస్య సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను వెంటనే అమలు చేయాలని, ఎలక్ట్రానిక్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థే కొనుగోలు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ విధానానికి బదులుగా పాత వైద్య విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంయూ డిపో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.వి.రమణ, ఆదినారాయణ, నాయకులు సుబ్బరామయ్య, హరి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వేయి రోజుల సంరక్షణ



అవగాహన కల్పిస్తున్న భాగ్యమ్మ

బి.కొత్తకోట : గర్భిణులకు వేయి రోజుల సంరక్షణ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ కె.భాగ్యమ్మ పేర్కొన్నారు. స్థానిక ఇందిరమ్మ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషన్ పక్వాడ కార్యక్రమం ద్వారా మహిళలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు స్వయంగా పోషణ్ ట్రాకర్‌లో తమ పేర్లను నమోదు చేసుకునే వెలుసుబాటు కేంద్ర ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. వైద్యుల సలహాలతో వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూపర్ వైజర్ హిజాద్‌ప్యారీ, ఏఎస్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



మాట్లాడుతున్న సీడీపీఓ సుజాత

నిమ్మనపల్లె : పోషకాహారం అందిస్తే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ సుజాత అన్నారు. పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం దిగువమాచిరెడ్డిగారిపల్లి అంగనవాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పోషణ్ పక్వాడ్ పక్షోత్సవం ఈ నెల 8వతేదీ నుంచి 22వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, పాలు, గ్రుడ్లు, పండ్లు ఉండాలన్నారు. అంగనవాడీ కార్యకర్తలు పిల్లల ఎదుగుదలను క్రమం తప్పకుండా పరిశీలించాలన్నారు. అంగనవాడీ కేంద్రాలను ఆహ్లాదంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాను లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



భూముల రీసర్వే ప్రారంభించిన అధికారులు

పీలేరు రూరల్ : భూముల రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు ఎం.భీమేశ్వరరావు అన్నారు. మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీలో భూ రీసర్వేపై గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీసర్వే దోహదం చేస్తుందన్నారు. గ్రామ పంచాయతీలో 750 సర్వే నెంబర్లకు గానూ 2700 ఎకరాల భూమి ఉందని, త్వరలో పంచాయతీలో భూ సర్వే ప్రారంభించి భూముల హద్దు గుర్తించనున్నట్లు తెలిపారు. వీఆర్వో హేమంత్ నాయక్, సర్వేయర్లు కీర్తన, మహేష్, వీఆర్ఏలు పాల్గొన్నారు.